# వికసించిన గులాబీ

రచన:
శ్రీ అండవిల్లి కొండలరావు

రామయ్యగారి పెళ్ళి పందిరి ఆనాడు చూడ్డానికి యెంతో ముచ్చటగా వుంది. ఓకవైపు సన్నాయి వాయిద్యం శ్రావ్యంగా విన్పడుతూ వుండగా మరియొక మూల బేండుమేళంలోంచి చక్కని సినీమా పాటలు వెదువడ్తున్నాయి.

రంగు రంగుల కాగితాలు, అనేక రంగులతో ప్రకాస్తుండెడి యెలక్ట్రిక్ దీపాలు!

ఇక, కళ్యాణ మంటపంలో, పెళ్లికి వచ్చిన చుట్టాలు, స్నేహితులు, ఒకర్నొకరితో సరసంగా ముచ్చటించుకుంటున్నారు.

ఇదే సమయమనుకొని పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు క్రీగంట చూసుకొంటూ తమలో తాము ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

'ఏమండోయ్! పెళ్ళి పెద్దగారూ! యీ గౌరీపూజ దగ్గర వధూవరులచేత రెండు రూపాయలు దక్షిణగా పెట్టించండి!'

అంటూ పురోహితుడు ఎక్కడ రావల్సిన డబ్బును యిదే సమయమనుకొని రాబట్టుకొంటున్నాడు.

ఎప్పుడు మంగళ హారతి పట్టుకు రమ్మంటారో? ఎంత కట్నం వసూలు చేస్తే బాగుంటుందో?' అని పెళ్ళికొడుకు ఆడబడుచులు తమలోతాము గుసగుసలాడ్తున్నారు. పెళ్ళికూతురు తండ్రి యివ్వజోయే కట్నం సొమ్ముకోసం వువ్విళ్లూరుతున్నాడు వియ్యంకుడుగారైన రామయ్య!

'మంగళ హారతి తీసుకొని రండి!'

అంటూ పెళ్లి చేస్తున్న పురోహితుడు భూపతి గట్టిగా చెప్పగానే పెళ్ళి కొడుకు ఆడబడుచులు యెగిరి గంతేసి లోపలికిపోయి ఓ పళ్ళెంలో యింత కర్పూరం వేసి తలొకరు వుమ్మడిగా పట్టుకొని వయ్యారంగా అడుగులువేస్తూ వస్తున్నారు.

అంతవరకూ వంటయింట్లో యేవేవో పన్లు చేస్తూ వస్తున్న పార్వతి ఆ మంగళహారతి పళ్ళెమును చూసి ఆనందంతో వుప్పొంగిపోయింది.

తానుకూడ ఆ పళ్ళెముమీద చేయివెయ్యబోయింది.

'ఏమమ్మోయ్! యీ శుభసమయంలో వోమూల కూర్చోక నలుగురిలో యిలా రావచ్చునా? మొగడు చచ్చిన ముండవి! నీయపవిత్రమైన చేత్తో దీన్ని తాకి మలినం చేయబోకు! ఛో, దూరంగా!' అంటూ ఆమెను బలవంతంగా క్రిందకు నెట్టివేసి పందిర్లోకి వెళ్ళిపోయారు.

పాపం! పార్వతి అవమానంతో సిగ్గుపడింది. వెంటనే దుఃఖంకూడ కల్గింది. గబగబ తన గదిలోకిపోయి చాప మీద కూర్చొని వెక్కి వెక్కి యేడ్చింది. 'ఆదిలో తనకు శంకరంతో పెళ్ళయిననాడు తానెంత సుఖంగా వుండేది! ఇటు అత్తింటివారు, అటు పుట్టింటివారు యెంతో ప్రేమించేవారు తనను! తాను యేది కోరితే అదిచ్చేవారు. యీ, ఆడబడుచులు 'వదినా!' అంటూ తననెంతో ఆప్యాయంగా పిలిచి గౌరవించేవారు.

ఈనాడు తన జీవితం యిలా వ్యర్థమైపోయింది. ఆదరించేవారెవరూలేరు. అందరూ తనను సూటిపోటి మాటల్తో బాధించేవారే! తానిప్పుడు 'విధవ' భర్తలేని స్త్రీ సంఘంలో జీవించలేదు ఆమె జీవితం దుఃఖంతోను, అవమానంతోను కృషించిపోవలసిందే! ఇక నేను ఎవరికోసం జీవించడం! యీవిధంగా అందరిచేత మాటలు పడ్డం దేనికి! చచ్చిపోనా! బ్రతికీ మరి లాభం లేదు!'

అని మనస్సులో ఆత్మహత్య చేసుకోందుకి నిశ్చయించుకొంది పార్వతి. గబుక్కున లేచింది. తలుపులు తీసి చుట్టూ చూసింది. ఎవ్వరూ తనను గమనించడం లేదు. ఎవరిపనుల్లో వారున్నారు. పార్వతి తొందరగా పెరటి వద్ద నున్న నూతిదగ్గరకు వచ్చింది.

'హే గంగా మాతా! యిలా బలవంతాన నాప్రాణం తీసుకొంటున్నందులకు క్షమించు వచ్చే జన్మలో నైనా నా జీవితం సుఖంగా వుండేటట్లు అనుగ్రహించు!'

అంటూ చేతులు జోడించి గంగను ప్రార్థించి కళ్ళు మూసుకొని ఆ నూతి లోపలకు గెంతబోయింది, కాని రెండు బలమైన చేతులు తన వీపుమీద పడి అందులోకి పడనీకుండ వేసాయి.

'అమ్మా! ఏమిటీ అఘాయిత్యం! నిండు జీవితాన్ని యిలా బలవంతంగా నాశనం చేసుకుంటున్నావా? 'జీవన్

భద్రాణి పశ్యతి!' మారుతుండే యీ లోకంలో బ్రతికే తీరాలి. ఆత్మహత్య మహాపాతకం! చచ్చి యెవర్ని సాధిస్తావ్! బ్రతికుండే సాధించాలి!

నీ భోగట్టా అంతా నా కిక్కడకు వొచ్చినప్పుడే తెల్పింది. నా మాటవిని నేను చెప్పినట్టు చెయ్! ఇటుపై యెట్టి పరిస్థితుల్లోనూ యిటువంటి ఘోరం తలపెట్టకు! రాజమండ్రిలో వీరేశలింగం పంతులుగారి వితంతుశరణాలయం వుంది. నీవంటివారి కక్కడ ఆశ్రయం దొరుకుతుంది. తిండిపెట్టి చదువు చెప్పిస్తారు. నీ వక్కడ సుఖంగా వుండొచ్చు. శరణాలయాధికారి నా మిత్రుడే! అతనికి వుత్తరం వ్రాసి యిస్తాను. పట్టుకువెళ్ళి అతనికి చూపించు. నిన్నాదరిస్తాడు. ఒక గంటలోనే ట్రైను వుంది రాజమండ్రి వెళ్ళడానికి! ఏమంటావు? నీకు అక్కడకు వెళ్ళుట కిష్టమేనా?' అంటూ పార్వతిని- బ్రతికించిన ఆ పెద్దమనిషి చెప్పగానే పార్వతి ఆవిధంగా చేయడానికి అంగీకరించింది.

వెంటనే ఆయన ఆమెకు కొంతడబ్బు, పరిచయ-పత్రమూ యిచ్చి రైల్వే స్టేషనుకి పంపించాడు. అతడు చుట్టూ ఓమారు చూసేడు. ఎవ్వరూ పిట్టమనిషయినా అక్కడ లేకపోవడం చూసి సంతోషించి తిరిగి పెళ్ళి పందిట్లోకి వొచ్చి కూర్చున్నాడు. ఇంకా అక్కడ పెళ్ళి జరుగుతునే వుంది.

పార్వతి ఆ రాత్రంతా ట్రైన్లో ప్రయాణం చేసి ఆ మర్నాడుదయం రాజమండ్రి చేరుకొంది. అచ్చట వితంతు శరణాలయాధికారికి వుత్తరం తీసి యిచ్చింది. ఆయన దాన్ని చదివి నిట్టూర్పు విడిచాడు. పార్వతి స్థితకి జాలిపడి ఆమెకు ఆశ్రయ మివ్వడానికి అంగీకరించాడు. ఇటువంటివారిని వుద్ధరించడమేగా ఆ శరణాలయోద్దేశం!

పార్వతి స్వతహాలా తెలివైనది. అందమైనదిన్నీ! ఆ శరణాలయంలో అందరి యెదుటా వినయంగా ప్రవర్తిస్తూ 'చాలా మంచిపిల్ల' అని వారిచేత కొనియాడబడూతూ వుంది.

శరణాలయానికి చెందిన స్త్రీల కళాశాలలో ప్రవేశించి 'మెట్రిక్' పరీక్ష ప్యాసయింది. తీరిక వేళలో సంగీతము, కుట్టుపన్లూ నేర్చుకొంటూ వుంది.

శరణాలయాధికారి పార్వతిని ఆ కళాశాలలోనే 'టీచర్'గా ప్రవేశపెట్టించాడు. పార్వతి కాలేజీలో కూడ మంచిపేరు తెచ్చుకుంది.

ఒకనాడు సాయంకాలం పార్వ ) పార్కు నుంచి వస్తుంది వేగంగా, శరణాలయానికి! ఆ తొందర్లో ఆమె 'హేండ్ బేగ్' జారి క్రిందపడిపోయింది. హఠాత్తుగ ఆ దృశ్యం చూసేడు రమేష్ అటువైపు నుంచే వస్తూ!

రమేష్ ఆ వూళ్లో బాగా పేరుపొందిన డాక్టరు. బ్రహ్మచారి అందంగా వుంటాడు యువకుడు.

'ఏమండీ! యీ 'హేండ్ బేగ్' మీదేనా?' అంటూ చేత్తోతీసి పార్వతి దగ్గరకు వడివడిగా వచ్చి చూపించేడు.

'థాంక్యూ! నాదేనండి!' అంటూ చేత్తో పుచ్చుకుంది. అప్పుడు ఆ యిద్దరి వ్రేళ్లూ ఒకదాంతో మ

*With the best compliments of:—* Tel : "STAR"

RAJAMONEY MATCH FACTORY

**SATTUR (S. I.)**

*BRANCH :—*

SIVAN MATCH WORKS

**KOVILPATTI (S. I.)**

*MANUFACTURERS OF :*

"LEOPARD" & "ANDHRA PULI"

BRAND QUALITY SAFTY MATCHES.

**Sales Depot :—139, MINT STREET, MADRAS-1.**

***Proprietor : V. ANNAMALAI NADAR.***

యొకటి తాకడంవల్ల వారిద్దరికీ అదొక విధమైన ఆనందంకలిగింది.

'క్షమించండి! మీ పేరేమిటో యేం చేస్తున్నారో దయచేసి చెప్తారా?'

'ఇది నడిరోడ్డు, ఎవరైనా చూస్తే బాగుండదు. రేపు యిదే వేళకు పార్కుకి రండి! తీరుబడిగా కూర్చొని మాట్లాడుకోవచ్చు!' అంటూ పార్వతి తొందరగా వెళ్ళిపోయింది. మర్నాడు పార్కులో కలుసుకోవచ్చుగదా కదా అన్న ఆనందంతో రమేష్‌కూడ యింటికి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి పడుక్కునేటప్పుడు పార్వతి బాగా ఆలోచించింది. తనకింకా వయస్సు యేమీ దాటలేదు. ఈ వయస్సులో ఒక పురుషుని అవలంబన లేనిదే సంఘంలో జీవించడం కష్టం! తనకా కోరికలేమీ తీరడంలేదు సంసారంలో. తప్పకుండా తనిప్పుడు పెళ్ళిచేసుకోవడం ముఖ్యం! చేసుకోదలిస్తే తనకు బజార్లో కన్పించిన యువకుణ్నే పెళ్ళిచేసుకోవాలి, అతను యిష్టపడితే! యిలా తీయని కోరికలతో పార్వతి హాయిగా నిద్రపోయింది, ఆ రాత్రి!

ఆ మరునాడు సాయంకాలం ఆ యిద్దరూ పార్కులో కల్సుకున్నారు. పార్వతి తన చరిత్రంతా చెప్పింది. రమేష్ ఆమె చెప్పిందంతా విని ఒక వేడినిట్టూర్పు విడిచాడు ఆమె పడిన కష్టాలికి! ఆదర్శ యువకుడు. పార్వతిని పెళ్ళి చేసుకొందుకి వొప్పుకున్నాడు. ఒక నెల రోజుల్లోనే వారిద్దరి వివాహం బంధుమిత్రుల యెదుట వైభవంగా జరిగిపోయింది. ఆ మర్నాడు అప్సరసలా అలంకరించుకొని వున్న పార్వతిని చూచి ముగ్ధుడయ్యాడు రమేష్!

'పార్వతీ! నేను చాలా అదృష్టవంతుణ్ణి! నీవంటి వుత్తమురాలు, అందగత్తె, విద్యావతియైన భార్య దొరికినందులకు!' అంటూ సువాసనలు విరజిమ్ముతూ వికసించిన గులాబీ పువ్వును ఆమె కొప్పులో అలంకరిస్తూ అన్నాడు.

'మీవంటి ఆదర్శవంతులైన మిమ్మల్ని భర్తగా పొందిన నేనే గొప్ప అదృష్టవంతురాల్ని! యీ గులాబీ పువ్వులాగే నా జీవితం కూడ మీ సాహచర్యం వల్లన వికసించింది.!' అంటూ ఆనందోత్సాహాల్తో ఆతని విశాల వక్షస్థలంలో తన ముఖం దాచుకొంది. (సమాప్తం)


నేషనల్ శాండల్
ఫేస్‌పౌడర్




అత్యుత్తమ వస్తువులతో తయారైనది. మనోహర పరిమళము నిస్తుంది. ఉముక మంట వుండవు. తేజస్సును హెచ్చించి చల్లదనాన్ని నవ తను సమకూర్చుతుంది. ఆంధ్ర ప్రదేశ మంతటా ఏజంట్లు కావాలి.



కోరినవారికి శాంపిల్ ప్యాకెట్ పంపిస్తాము.

ఎం. ఖాదర్ సాహెబ్ అండ్ సన్సు

(మనుఫాక్చరింగ్ పర్‌ఫ్యూమర్స్ - స్థాపితము 1872)

35-F. ఈస్ట్ చిత్తిరై స్ట్రీట్ : : మధురై (ద.ఇ.)